సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 22 । జూలై । 2023



కళా కుసుమం

కొంతేరుకు చెందిన కళాకారుడు ఆకుమర్తి బాబూరావు ఈనెల 23న హైదరాబాద్‌లో కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారాన్ని అందుకోనున్నారు. IIలో ▸



ట్రాక్టర్ కింద పడి..

మొగల్తూరు మండలం పడమటిపాలేనికి చెందిన యువకుడు ఇటుక ట్రాక్టర్ మీద నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. IIలో ▸



యువకుడి దుర్మరణం

కాళ్ల మండలం జక్కరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుతేజ అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక లోక్ అదాలత్



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి

ఏలూరు (టూటౌన్): జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లికృష్ణ తెలిపారు. స్థానిక న్యాయసేవా సదన్ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వాహన ప్రమాద, భూనష్టపరిహార క్లయిమ్‌లు పరిష్కరిస్తారన్నారు. ఏలూరులో మూడు, కొవ్వూరులో ఒక బెంచ్ ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని బీమా కంపెనీల అధికారులు, కక్షిదారులు, న్యాయవాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

25న మినీ జాబ్‌మేళా

సాక్షి, భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఈనెల 25న మినీ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ మధుభూషణరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, బ్లూస్టార్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఫ్లిప్‌కార్ట్‌లో భీమవరం, తణుకు, పాలకొల్లులో డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, బ్లూస్టార్ కంపెనీలో ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, అప్రెంటీస్ ట్రైనీ మొదలైన విభాగాల్లో ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా విద్యార్హతలు గలవారు అర్హులని, వివరాలకు సెల్ 8919684670లో సంప్రదించాలని కోరారు.

రేపు పంచాంగకర్తల సమాఖ్య రాష్ట్ర సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ పంచాంగకర్తల సమాఖ్య రాష్ట్ర సమావేశం ఆదివారం ఏలూరులో నిర్వహించనున్నట్లు నగరానికి చెందిన త్రిశక్తి జ్యోతిర్నిలయం ప్రతినిధి వి.భరద్వాజ్ సిద్ధాంతి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హేలాపురి బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం నిర్వహిస్తామని, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ హాజరవుతారని పేర్కొన్నారు. పలు సిద్ధాంతాల సమన్వయంపై చర్చిస్తారని తెలిపారు. అనంతరం పీసపాటి పాలశంకర వరప్రసాద్ సిద్ధాంతి (ఇరగవరం), హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం ఆస్థాన సిద్ధాంతి కాశీభొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణప్రసాద్ శాస్త్రి, పిడపర్తి పంచాంగకర్త పిడపర్తి వీరేశ్వర శాస్త్రిలను సత్కరిస్తారని పేర్కొన్నారు.

24న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

పెంటపాడు: ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈనెల 24న తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.ఫణీంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.40 చెల్లించాలని, ఆసక్తి గల విద్యార్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో తాడేపల్లిగూడెంలోని నిట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు సెల్ 94901 04336 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కిడ్నాప్ కలకలం

సాక్షి, భీమవరం: భీమవరంలో కిడ్నాప్ కలకలం రేగింది. కొందరు వ్యక్తులు ఒక మహిళను కారులో తీసుకువెళ్లారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానిత కారును నరసాపురంలో పట్టుకుని కారు డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కాకినాడ జిల్లా నుంచి వచ్చిన వ్యక్తులుగా సమాచారం అందిందని, వివరాలు సేకరిస్తున్నామని టూటౌన్ సీఐ కృష్ణకుమార్ చెప్పారు.

పట్టిసీమ ఎత్తిపోతల ట్రయల్‌రన్



ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ట్రయల్‌రన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఒక్కో మోటార్‌ను ఆన్ చేస్తూ వరద నీటిని కుడి కాలువలోకి విడుదల చేశారు. అవసరమైతే కృష్ణాకు నీటిని విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నామని ఈఈ కె.ఏసుబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేస్తామన్నారు.

ముంచెత్తిన నది

- కొనసాగుతున్న గోదావరి వరద ఉధృతి
- ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు
- పోలవరం నుంచి 7.75 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- కనకాయలంకలో నీటమునిగిన కాజ్‌వే
- వేలేరుపాడు మండలంలో 20 గ్రామాలకు రాకపోకలు బంద్
- పునరావాస కేంద్రాల ఏర్పాటు



కుక్కునూరు: వరద పరిస్థితిని పరిశీలిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు మండలంలో 20 గ్రామాలు, కుక్కునూరు మండలంలో ఒక గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు వరద నీటి ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. ప్రాజెక్టు నుంచి దిగువకు 7.75 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

మరింత కొనసాగే అవకాశం

గోదావరి వరద ఉధృతి కొనసాగింది. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం, అలాగే తొమ్మిది లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ముంపు ప్రభావిత గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శని, ఆదివారాల్లో కూడా వరద ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు వరద నీటి తీవ్రత పెరుగుతూ ఉంది. గురువారం ప్రాజెక్టు నుంచి 6,33,480 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్పిల్‌వే 32.500 మీటర్ల నుంచి 45 గేట్లు ఎత్తి దిగువకు 7,75,079 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే మీదకు వరద నీరు చేరింది.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

వరద ప్రభావానికి గురైన వేలేరుపాడు మండలంలో ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి క్షేత్రస్థాయిలో పర్యటించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 22 గ్రామాలకు వరద ప్రమాదం ఉంటుందని అంచనా వేసి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను తరలించారు. అలాగే రెండు మండలాల్లోని 22 గ్రామాల్లో ఉన్న 42 తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి రక్షిత తాగునీరు అందించేలా జిల్లా పంచాయతీ అధికారి చర్యలు తీసుకున్నారు. మరోవైపు వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట, నార్లవరం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ఐదు పడవలను ప్రత్యేకంగా రాకపోకల కోసం ఏర్పాటు చేశారు. అలాగే పునరావాస కేంద్రాల వద్ద తొమ్మిది చేతిపంపులు ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలకు రేషన్ సరుకులు అందించారు. 21 రోజులకు సరిపడా మందులతో పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రెండు మండలాల్లో ఇప్పటికే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, బోట్లు, గజ ఈతగాళ్లను అధికారులు సిద్ధం చేశారు.

సమర్థంగా ఎదుర్కొంటాం: కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): గోదావరిలో ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో వరద తలెత్తితే సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో 10 వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించామన్నారు. ముఖ్యంగా యలమంచిలి, ఆచంట మండలంలో లంక గ్రామాలు వరద ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. ఈ మేరకు ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లను అప్రమత్తం చేసి వరద ఉధృతిని పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. వరద ప్రభావిత గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతోపాటు శిక్షణ పొందిన ఆపదమిత్ర వలంటీర్లను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులను అప్రమత్తం చేసి ఆ శాఖ అధికారులనూ నియమించామన్నారు. ముందస్తుగా పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. విపత్తుల నివారణ నుంచి కూడా సిబ్బందిని సిద్ధంగా ఉంచామని చెప్పారు. వరదలకు సంబంధించి కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్, టోల్ ఫ్రీ నంబర్ 08816-299189 ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రశాంతి వివరించారు.



యలమంచిలి: కనకాయలంక వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో ఇంజిన్ పడవలపై రాకపోకలు

కనకాయలంక కాజ్‌వే పైకి వరద



కనకాయలంక వద్ద కాజ్‌వే వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

యలమంచిలి: గోదావరి ఎగువ భాగం నుంచి వరద నీరు పొంగిరావడంతో మండలంలో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో కనకాయలంక వద్ద కాజ్‌వేపై నుంచి నాలుగు అడుగుల వరద నీరు ప్రవహిస్తుంది. ప్రజల రాకపోకలకు వీలుగా ఇంజన్ పడవలు ఏర్పాటుచేశారు. కనకాయలంకలో వరద పరిస్థితిని చూసేందుకు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి శుక్రవారం పర్యటించారు. శనివారం మధ్యాహ్నానికి కాజ్‌వే వరద నుంచి బయటపడుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. దీంతో శనివారం గ్రామంలో నిర్వహించనున్న సురక్ష గ్రామసభను యథావిధిగా నిర్వహిస్తామని చెప్పారు. వరదలతో విష సర్పాల సంచారం ఉంటుందని భావించి ఈ నేపథ్యంలో కనకాయలంకలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు, బాలింతలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తహసీల్దార్ చెప్పారు. ఆయన సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, వీఆర్వో సరెళ్ల లక్ష్మి ఉన్నారు.



కనకాయలంక గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

టిడ్కో పేరుతో టీడీపీ దోపిడీ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



టిడ్కో లబ్ధిదారులకు రుణ పత్రాలు అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తెలుగుదేశం ప్రభుత్వంలో టిడ్కో గృహాల పేరుతో వేల కోట్లు దోచేశారని, వందల కోట్లు మనీ లాండరింగ్ చేశారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. స్థానిక ఏపీ టిడ్కో గృహ సముదాయాల వద్ద శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన లబ్ధిదారులకు రుణ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ టిడ్కో నిర్మాణాల్లో చదరపు అడుగుకు రూ.1,250 ఖర్చయ్యే దానికి రూ.2,100కు ఒప్పందం కుదుర్చుకుని ఎల్‌అండ్‌టీ కంపెనీ నిర్మాణాలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం అడుగుకు రూ.40 మాత్రమే కంపెనీకి చెల్లించాల్సి ఉండగా నిర్మాణాలు నిలిపివేయడం దారుణమన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో చంద్రబాబుతో చేతులు కలిపి లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. పట్టణంలో 5,376 గృహాలకు గాను 2,272 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు అందించామన్నారు. 3,104 యూనిట్లను అందించాల్సి ఉండగా వారిలో 1,285 మందికి వయసు మీరడంతో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయన్నారు. ఈ సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగా బ్యాంకుల నుంచి రుణాలు ఇచ్చేలా రుణమేళా ఏర్పాటు చేశారన్నారు. దీంతో బ్యాంకు లింకేజీకి బ్యాంకు అధికారులు ముందుకు వచ్చారన్నారు. టిడ్కో నిర్మాణాల్లో అవసరం లేకపోయినా చంద్రబాబు షేర్‌వాల్ టెక్నాలజీని తీసుకువచ్చి వేల కోట్లు దోచేశాడని దుయ్యబట్టారు. వైఎస్సార్ హయాంలో 59 ఎకరాల విమానాశ్రయ భూములకు పేదల కోసం రూ.5.50 కోట్లతో మెరక చేయించామని, వీటిపై కూడా కన్నేసి చంద్రబాబు వందల కోట్లు కొట్టేశాడని ధ్వజమెత్తారు.

డ్రెయినేజీ నిర్మాణానికి రూ.10 కోట్లు

ఏపీటిడ్కో నుంచి ఉప్పాకపాడు డ్రెయినేజీ అండర్ టన్నెల్ వరకు డ్రెయినేజీ నిర్మాణానికి సీఎం జగన్ రూ.10 కోట్లు మంజూరు చేశారన్నారు. టిడ్కో గృహాల వద్ద మున్సిపల్ కమిషనర్ జంగిల్ క్లియరెన్స్ చేయించారని, వీధిలైట్లు ఏర్పాటు చేశారని మంత్రి కొట్టు చెప్పారు. బస్సు యాత్రలో వచ్చిన టీడీపీ దొంగలు ఇక్కడ పల్లె నిద్ర చేసి సిగ్గులేకుండా మాట్లాడారని విమర్శించారు. వీరి మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. టిడ్కో గృహాల్లో 300 చదరపు అడుగుల ఫ్లాట్‌ను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. అలాగే గృహాలను లబ్ధిదారులకు అప్పగించే వరకూ బ్యాంకు రుణాలకు వడ్డీని జగన్ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అక్టోబరు 2 నాటికి నూరుశాతం ఫ్లాట్‌లను అప్పగిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు. మున్సిపల్ ఇంజనీర్ డి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ, మెప్మా పీడీ ఇమ్మానియేలు, ఎల్‌డీఎం నాగేంద్రప్రసాద్, ఈఈ స్వామినాయుడు, టెక్నికల్ అధి కారి నాగేశ్వరి, ఎల్ అండ్‌టీ మేనేజర్ యోగానంద్, సుధీర్, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, బోళం రామలక్ష్మి, ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఈ–క్రాప్ నమోదు చేయాలి

జేసీ రామసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జేసీ ఎస్ రామసుందర్‌రెడ్డి, చిత్రంలో వ్యవసాయ మండలి అధ్యక్షుడు కైగాల

సాక్షి, భీమవరం: జిల్లాలో ఈ–క్రాప్ నమోదు నూరు శాతం పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో త్వరితగతిన నాట్లు వేసేలా రైతులను ప్రోత్సహించాలని, డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగించాలని, రైతులకు టార్పాలిన్లు అందించాలని కోరారు. వరి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చినందున రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లాను అభినందించారన్నారు. జేసీ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో 74,083 మంది రైతుల నుంచి 6.43 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించగా రూ.1,312 కోట్లకు రూ.1,3,10 కోట్లు వారి ఖాతాల్లో జమచేసినట్టు సివిల్ సప్లయీస్ డీఎం తెలిపారు. మిగిలిన రూ.2 కోట్ల రైతుల ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడంతో పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. సలహా మండలి సభ్యుడు కొట్టు కుటుంబరావు మాట్లాడుతూ బేతపూడి, తుందుర్రు రెవెన్యూ, చినగరువు, పెద్దగరువు ప్రాంతాల్లో సుమారు 450 ఎకరాలు తరచూ ముంపునకు గురవుతోందని, చర్యలు తీసుకోవాలని కోరారు. మరో సభ్యుడు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు మాట్లాడుతూ రొయ్యల మేత రేటు పెరిగిపోయిందని, గిట్టుబాటు ధర రావడం లేదని, కొందరికి ఆక్వా విద్యుత్ సబ్సిడీ అందడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సంఘాని వడ్డికాసులు, జలవనరుల శాఖ ఈఈ దక్షిణామూర్తి, జిల్లా జల వనరుల అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉద్యాన అధి కారి ఎ.దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ‘నేతన్న నేస్తం’

కలెక్టర్ ప్రశాంతి



నేతన్న నేస్తం చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అండగా నిలుస్తోందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వెంకటగిరిలో సీఎం జగన్ వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు చెందిన 1,027 మంది లబ్ధిదారులకు రూ.24 వేల చొప్పున రూ.2,46,48,000 వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సాయాన్ని వినియోగించుకుని చేనేతలు అభివృద్ధి చెందాలని కోరారు. మగ్గాలను ఆధునికీకరించుకునిఇ కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాల ఉత్పత్తి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ నమూనా చెక్కు అందజేశారు. చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్.రఘునంద, విస్తరణ అధికారి బి.రామయ్య పాల్గొన్నారు.

వరి.. వెదజల్లు సిరి

- వెదజల్లు పద్ధతితో బహుళ ప్రయోజనాలు
- ఎకరాకు 15 కిలోల విత్తనాలు చాలు
- ముందుగానే పంట చేతికి..
- 15 శాతం అధిక దిగుబడులు



డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో సార్వా వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్నిచోట్ల నాట్లు ఆలస్యమవుతున్న నేపథ్యంలో వెదజల్లు పద్ధతి చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వెదజల్లు పద్ధతి వల్ల సమయం కలిసిరావడంతో పాటు సాగు ఖర్చు ఎకరాకు రూ.8 వేల వరకు తగ్గుతుందని అంటున్నారు. వరిలో అధిక దిగుబడులు సాధించాలంటే సకాలంలో నాట్లు వేయడం, సరైన సమయంలో కలుపుతీత ప్రధానమైనవి. కూలీల కొరత, కూలీ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పెట్టుబడులు తగ్గించుకునేందుకు వెదజల్లు పద్ధతి మేలు. దీని వల్ల పంట కాలం తగ్గడంతో పాటు ఖర్చులు కూడా కలిసివస్తాయి.

పొలం తయారీ ఇలా..

వరి విత్తనాలు వేయడానికి 15 రోజుల ముందుగా పొలాన్ని మురగ దమ్ము చేసుకోవాలి. విత్తడానికి నాలుగు రోజుల ముందుగా మరోసారి దమ్ముచేసి పొలమంతా ఎత్తు పల్లాలు లేకుండా చదును చేసుకోవాలి. పొలాన్ని చిన్నపాటి మడులుగా చేసుకుంటే చదును చేసుకోవడానికి, నీరు పెట్టడానికి వీలుగా ఉంటుంది. వెదజల్లు పద్ధతిలో నాట్లు వేసే రైతులు కాండం బలంగా ఉండి పడిపోని విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. దీనికి ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, పీఎల్ఏ 1100 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలి. విత్తనాలు వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 15 కిలోలు, డ్రమ్‌సీడర్‌తో 12 కిలోలు విత్తనాలు సరిపోతాయి.

విత్తన శుద్ధి తప్పనిసరి

వరిసాగులో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండిజమ్ 50 శాతం లేదా కార్బెండిజమ్ 25 శాతంతోపాటు మాంకోజేబ్ 50 శాతం మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. శుద్ధి చేసిన విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 12 నుంచి 24 గంటలపాటు మండి కట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. డ్రమ్‌సీడర్ పరికరానికి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్‌లు ఉంటాయి. ఈ డ్రమ్‌లకు రెండువైపులా 20 సెంటీమీటర్ల దూరంలో 18 రంధ్రాలున్నందున ఒకసారి డ్రమ్‌సీడర్ లాగితే ఎనిమిది వరుసల్లో విత్తనాలు పడతాయి. డ్రమ్‌సీడర్ ఒక యూనిట్‌తో కేవలం రెండు గంటల్లో ఇద్దరు కూలీల సహాయంతో ఎకరా పొలంలో విత్తుకోవచ్చు.

నీటి యాజమాన్యం ఇలా..

డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలు వేసిన 10 రోజుల వరకు ఆరుతడులు ఇచ్చుకోవాలి. తర్వాత పలుచగా నీరు నిలగట్టి, మొక్క నాలుగైదు ఆకులు తొడిగిన తర్వాత మూడు సెంటీమీటర్ల వరకు నీరు పెట్టాలి. పైరు దుబ్బు కట్టడం పూర్తయిన దగ్గర నుంచి పంట కోతకు 10 రోజుల ముందు వరకు ఐదు సెంటీమీటర్ల నీరు పెట్టుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

వరిసాగులో ఎకరాకు 36 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలి. అయితే స్వర్ణ, ఎంటీయూ 1318 రకాలు సాగు చేసే రైతులు ఎరువుల మోతాదు తగ్గించి ఎకరాకు 24 కిలోల నత్రజని, 16 భాస్వరం, 16 కిలోల పొటాష్ వేసుకుంటే సరిపోతుంది. నత్రజని ఎరువులను మూడు సమ భాగాలుగా చేసి విత్తిన 15 రోజులకు, 35 రోజులకు, 60 రోజులకు వేసుకోవడం మంచిది. కలుపు సమస్య నివారణకు తప్పనిసరిగా రసాయన కలుపు మందులు వాడుకోవాలి.

ప్రయోజనాలెన్నో..



వరిసాగులో వెదజల్లు, డ్రమ్‌సీడర్ పద్ధతిలో సాగుచేస్తే పంట కాలం తగ్గడమే గాక ఎకరాకు 15 శాతం అధిక దిగుబడి సాధించవచ్చు. అలాగే ఎకరాకు సుమారు రూ.8 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. నాట్లు వేసుకోవడానికి, కలుపుతీతకు కూలీల ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ ఎం.భరతలక్ష్మి, సహ పరిశోధన సంచాలకురాలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి



పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో సాయిరాం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

యలమంచిలి: మొగల్తూరు మండలం పడమటి పాలెంకు చెందిన యల్లా సాయిరాం (18) శుక్రవారం పెనుమర్రులో ట్రాక్టర్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్లు ఎస్సై జాజుల నాగ ప్రసాద్ తెలిపారు. సాయిరాంతోపాటు మరికొందరు కార్మికులు మొగల్తూరు నుంచి ట్రాక్టర్‌లో బాడవ వచ్చి ఇటుక వేసుకున్నారు. అక్కడ నుంచి పెనుమర్రు వచ్చి కొంత ఇటుక రెండుచోట్ల దిగుమతి చేశారు. ఇంకా ఇటుక ఉండడంతో తిరుగు ప్రయాణమయ్యారు. ట్రక్కు ముందు భాగంలో కూర్చున్న సాయిరాం మంచి నీరు కావాలని పైకి లేచాడు. పగ్గం తగలడంతో కింద పడిపోయాడు. ట్రక్కు చక్రాలు సాయిరాం రెండు కాళ్ల మధ్య నుంచి వెళ్లాయి. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సాయిరాం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కళా కుసుమం బాబూరావు

23న కోడి రామకృష్ణ ప్రతిభా అవార్డు ప్రదానం



సినిమా చిత్రీకరణలో ఆకుమర్తి బాబూరావు (ఫైల్)

పాలకొల్లు అర్బన్: పల్లెలో వికసించి మహా నగరంలో పరిమళించిన కళా కుసుమం ఆకుమర్తి బాబూరావు. రంగస్థల నటుడిగా, నృత్య, సంగీత దర్శకుడిగా, కథ, మాటలు, పాటల రచయితగా, వెండి తెరపై హీరోగా ఎదిగి సినీ పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన బాబూరావు కోడి రామకృష్ణ ప్రతిభా అవార్డును ఈ నెల 23న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో అందుకోబోతున్నారు. రంగస్థలంపై ఆడది, కొక్కొరోకో, చరిత్ర పుటల్లో మరో పేజీ, ఏడవకండేడవకండి, కీర్తిశేషులు, రాయి తదితర నాటికల్లో ప్రధాన పాత్రలు పోషించి అవార్డులు అందుకున్నారు. ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు స్ఫూర్తితో సినీ రంగ ప్రవేశం చేశారు. దూరదర్శన్‌లో పలు సీరియల్స్‌లో నటించారు. ప్రముఖ డ్యాన్సర్ ముక్కురాజు వద్ద అసిస్టెంట్‌గా, అనంతరం డాన్స్‌మాస్టర్‌గా పలు చిత్రాలకు పనిచేశారు. అవుట్ డోర్ యూనిట్‌ను స్థాపించి సీరియల్స్, సినిమాలకి అవుట్ డోర్‌యూనిట్‌ను సరఫరా చేశారు. బ్రహ్మర్షి విశ్వామిత్రలో నందమూరి తారక రామారావు దర్శకత్వంలో బాబూరావు నృత్యం చేశారు. 1997లో ఓ సీరియల్ కోసం బాబూరావు రచించిన పాటను ఆయన సంగీత దర్శకత్వంలో ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం పాడడం మరచిపోలేని సంఘటనగా బాబూరావు గుర్తు చేసుకుంటారు. సినీ నిర్మాతగా మగసింహం, ఓ రాధ కథ, సూపర్ స్టార్స్ నిర్మించారు. బ్రహ్మర్షి విశ్వామిత్ర, మధ్య తరగతి మహా భారతం, శ్రీదేవి నర్సింగ్ హోం, వన్ బై టు, అన్నమయ్య సినిమాల్లో నటించారు. పలు అసోసియేషన్లలో శాశ్వత సభ్యుడిగా గుర్తింపు పొందారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

దొంగల ముఠాలు వస్తున్నాయ్ జాగ్రత్త!

పెదవేగి: గ్రామాల్లో పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి దొంగతనాలకు పాల్పడే ముఠాలు సంచరిస్తున్నాయని పెదవేగి ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ హెచ్చరించారు. చుట్టుపక్కల మండలాల్లో ఈ తరహా దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటి ముఠాలు వస్తువులు విక్రయించే వారిలా తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటారని ఆయన తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఏలూరు (టూటౌన్): చెల్లని చెక్ కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెలువరించారు. లంకా కిషోర్ అనే వ్యక్తి ఏలూరుకు చెందిన టి.శ్రీనివాసరావు నుంచి డబ్బులు అప్పుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు బౌన్స్ అవ్వడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన జడ్జి శుక్రవారం తుది తీర్పును వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంఘటన స్థలంలో ప్రభుతేజ(23) మృతదేహం

కాళ్ల: కాళ్ల మండలం జక్కరం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం వన్ టౌన్ ఏరియా పెదపేటకు చెందిన నీలపు ప్రభుతేజ (23) శుక్రవారం జక్కరంలో ఉన్న తన స్నేహితులను కలిసి తిరిగి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా జక్కరం సెంటర్లలో భీమవరం నుంచి వస్తున్న ప్రయివేటు స్కూల్ బస్సు అతివేగంతో బైక్‌ని ఢీకొట్టింది. దీనితో ప్రభుతేజ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాళ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో బంగారం చోరీ

గణపవరం: గణపవరం మండలం పిప్పర నుంచి గణపవరం వస్తున్న ఆటోలో ఒక మహిళ పర్సు నుంచి బంగారం చోరీ జరిగింది. గోపవరానికి చెందిన అడపా భవాని బుధవారం ఆటో ఎక్కి గణపవరం బయలుదేరింది. అప్పటికే ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలు భవాని హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచిన రెండున్నర కాసుల బంగారు గొలుసుని చాకచక్యంగా దొంగిలించి ఆటో దిగిపోయారు. గణపవరం వచ్చాక ఆటోడ్రైవర్‌కు డబ్బులు ఇవ్వడానికి హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా అందులోని పర్సు కనిపించకపోవడంతో బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. మహిళల ఆచూకీ కోసం మూడురోజులుగా వెతికి చివరికి శుక్రవారం సాయంత్రం గణపవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిన్నారి మృతిపై దుష్ప్రచారం

ఏలూరు టౌన్: భీమడోలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో అంగలూరి చిన్నారి(4)కి పారిశుధ్య కార్మికులు వైద్యం చేశారంటూ సోషల్‌మీడియాలో చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఏలూరు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డాక్టర్ ఏవీఆర్ మోహన్ అన్నారు. భీమడోలు మండలం అర్జావారిగూడెంకు చెందిన చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా మూడు రోజులు గ్రామంలోని ఆర్‌ఎంపీకి చూపించారు. జ్వర తీవ్రత పెరగడంతో భీమడోలు సీహెచ్‌సీకి ఈనెల 19న మధ్యాహ్నం 12.30గంటలకు తీసుకువచ్చారని తెలిపారు. చిన్న పిల్లల వైద్యుడు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయించగా నెగిటివ్ వచ్చిందని తెలిపారు. అదేరోజు సాయంత్రం వరకూ చిన్నారి ఆరోగ్యం స్థిరంగా ఉండగా రాత్రి 7.30 గంటలకు కడుపునొప్పి వస్తుందని చెబుతూ చిన్నారి స్పృహ కోల్పోయింది. వెంటనే డ్యూటీలో ఉన్న డాక్టర్ అశ్విని చికిత్స ప్రారంభించి, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ అల్బర్ట్‌కు సమాచారం అందించారు. చిన్నారిని రక్షించేందుకు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది ప్రయత్నం చేశారు. బాలిక ఆరోగ్యస్థితి క్షీణించటంతో భీమడోలు సీహెచ్‌సీలోనే రాత్రి 8.20 గంటలకు మరణించిందని తెలిపారు. హాస్పిటల్‌లో పారిశుధ్య కార్మికులు వైద్యం చేసే అవకాశం లేదని మోహన్ స్పష్టం చేశారు. భీమడోలు సీహెచ్‌సీలో మంచి వైద్యం అందుబాటులోకి ఉందని.. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు ప్రత్యేక పూజలు


బలుసులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, సభ్యులు వట్టిప్రోలు రాము, పెదప్రోలు భాస్కర్, అడ్డాల నరసింహారావులు ప్రత్యేక పూజలను పర్యవేక్షించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

అప్పారావుపేటలో ఫ్రైడే డ్రైడే


అప్పారావుపేట గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణతోనే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. తాగేసిన కొబ్బరి బొండాలు, వాడేసిన టైర్లు వంటివి ఇంటి ఆవరణలో ఉండరాదని, వీటిల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇంటి ఆవరణలో పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యదర్శులు ఝాన్సీ, ఎంఎల్‌హెచ్‌పీ సలోమి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, బాబ్జీ, ఆశాలు పాల్గొన్నారు.

రెండవ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ


పడాల స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండవ సెమిస్టర్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పడాల స్టాక్ పాయింట్ నుంచి ఎంఈవో వి.హనుమ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకటి నుంచి తొమ్మిదవ తరగతులకు సంబంధించి శుక్రవారం సాయంత్రం నాటికి రెండవ సెమిస్టర్ పుస్తకాలు పాఠశాలలకు చేరాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీంతో ఐదు రూట్ల ద్వారా రేషన్ వాహనాల్లో ఆయా పాఠశాలలకు పుస్తకాలు పంపిస్తున్నట్లు ఎంఈవో వి.హనుమ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నందన్‌రావు, సీఆర్పీ బత్తుల నాని, మండల టీవోటీ పాట్నూరి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో పోలీసు పరేడ్


మార్కెట్‌యార్డు వద్ద పోలీసు పరేడ్ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక మార్కెట్‌యార్డ్ వద్ద శుక్రవారం సివిల్, ఏఆర్, హోం గార్డ్ పోలీస్ సిబ్బంది జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏఈవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎప్పుడు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివస్‌ను నిర్వహిస్తున్నామని సిబ్బందికి శాఖపరమైన సమస్యలుంటే సంక్షేమ దివస్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ ఎన్‌వీ సత్యనారాయణ, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

సాక్షి, భీమవరం: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాల ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష శిబిరాన్ని ప్రారంభించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనాల వెంకటరావు, కర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.వాసుదేవరావు, బంగారు వరలక్ష్మి, నిమ్మకాయలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగనన్నతోనే సాధ్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడులో రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం


పెంటపాడులో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రజాసంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే సాధ్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెంటపాడు గ్రామంలో మంత్రి ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జగనన్న అందిస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, ముస్లీంల షాదీఖానా, బీసీ కాలనీ, పంతలో ములసమ్మ అమ్మవారి ఆలయం తదితర ప్రాంతాల్లో ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు చేసిన ఎన్నికల వాగ్దానాలు, మ్యానిఫెస్టోలు తుంగలో తొక్కారన్నారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దు చేయలేదని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. నేడు ప్రతీ వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని వాగ్దానాలు 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అనే వ్యక్తి రాష్ట్రంలో ఉన్నంతకాలం రాజకీయాలు కలుషితంగానే ఉంటాయని ఆయన విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కాపురం ఉంటున్న చంద్రబాబును అక్కడికే పరిమితం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, బీసీ సంఘ నాయకులు బర్ల జయరాంబాబు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల బాబి నాగమణి, సొసైటీల అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, దేవ వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జామికృష్ణ, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పొట్ల ఏడుకొండలు, పార్టీ నాయకులు బోణం వీరయ్య, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీ రాజ్ ఏఈ నవీన్, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సలాం



పట్టణంలో నేను 12వ వార్డులో నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ మల్లిపూడి సుజిత రాణి సేవలు అభినందనీయం. ప్రభుత్వ సంక్షేమాలను ఎప్పటికప్పుడు తమ వద్దకు చేరవేస్తుంది. రేషన్, ఆరోగ్య శ్రీ,, అమ్మవడి, డ్వాక్రా రుణాలు, తదితర సంక్షేమాలు అందుతున్నాయి. రాబోయే ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– గరగ సత్యనారాయణ, సీనియర్ సిటిజన్, పాతూరు, తాడేపల్లిగూడెం

ఇంటికి వెళ్లి.. సేవలందించి



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో నేను పాతూరు 12వ వార్డులో నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ మల్లిపూడి సుజిత రాణి సేవలు మరవలేనివి. సుజిత రాణి ఇంటింటికి రావడం, ఆరోగ్య సమాచారం అడగటం, ప్రభుత్వ సంక్షేమాలను వెల్లడించడం, అనేక సంక్షేమాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరుతుంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన ఆదర్శప్రాయం. ఎన్నో సేవలు సీఎం ద్వారా అందరికి అందాలని కోరుతున్నాను.

– సమయం మధు కళ్యాణి, గృహిణీ, పాతూరు, తాడేపల్లిగూడెం

కొనసాగుతున్న వీఆర్‌ఏల నిరసన దీక్షలు


తణుకు తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు


ఇరగవరంలో ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

తణుకు టౌన్: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా తణుకు మండలంలో విఆర్‌ఏలు సబ్ కలెక్టర్ ఎం.ఎం.సూర్యతేజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు నిలుపుదల చేసిన డీఏలను తిరిగి చెల్లించాలని కోరారు. అర్హులైన వీఆర్‌ఏలకు నైట్ వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్, వీఆర్‌వోలుగా నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌డీప్రసాద్, యూనియన్ నాయకులు పండు, ఎం బలరామ్, బ్రహ్మయ్య, ,ఆర్ సుబ్బారావు, యం ధర్మారావు, టీ దానయ్య, పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామా రెవెన్యూ సహాయకుల ధర్నా

ఇరగవరం: మండలంలోని గ్రామా రెవెన్యూ సహాయకులు శుక్రవారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామా రెవెన్యూ సహాయకులు జిల్లా అధ్యక్షుడు బుంగా గణేశ్వరరావు మాట్లాడుతూ విఆర్‌ఏలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలన్నారు. నిలుపుదల చేసిన టిఏ డిఏలను వెంటనే చెల్లించి అర్హులైన విఆర్‌ఏలను నైట్ వాచ్‌మెన్, అటెండర్లు, డ్రైవర్లు ను విఆర్‌ఏల నుండి విఆర్‌వోలుగా పదోన్నతులు కల్పించాన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కట్టుంగ కోటేశ్వరరావు, అవిడి మల్లయ్య, బి ప్రసన్న కుమారి మండల విఆర్‌ఏలు, అటెండర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఒప్పంద కార్మికుల నిరసన


రిలే దీక్షలు వద్ద మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు, బి.సోమయ్యలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, బి.సోమయ్యలు డిమాండ్ చేశారు. మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండో రోజు రిలే నిరాహార దీక్షలు పట్టణంలోని గాంధీ మండపం వద్ద శుక్రవారం జరిగాయి. రాష్ట్ర నాయకులు హాజరై మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లుకు కనీస వేతనం అమలు చేయలని, హెల్త్ అలవెన్సులు బకాయిలను వెంటనే చెల్లించాలని, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. మునిసిపాలిటీల్లో దళారి వ్యవస్థ రద్దు చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీన మునిసిపల్ కార్యాలయాలు ముట్టడి, ఆగస్టు ఏడోవ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధనాల వెంకట్రావు, ధనాల దానయ్య, ఏబీ శ్రీనివాస్, కె.రామకృష్ణ, జి.నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న, మునిసిపల్ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రం గర్భవతులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భస్థ శిశువు నుంచి ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ రాష్ట్ర సభ్యురాలు కొల్లా విజయలక్ష్మికుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రం 118లో గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మికుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అనంతరం 104 వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చిన్నారుల ఆరోగ్యం, బరువు వంటి వాటిని పరీక్షించారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రూపాదేవి, ఎంపీహెచ్‌ఏ వెంకటేశ్వరరావు,ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్.సందీప్‌రాజ్, ఏఎన్‌ఎం పి.లలితదేవి, అంగన్‌వాడీ టీచర్ చిగురుపాటి మంగతాయారు, ఆశ వర్కర్ పి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మానవత చేయూత


విద్యార్థులకు కంప్యూటర్లు బహూకరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: ప్రతిభావంతులైన ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు మానవత సంస్థ చేయూతనందిస్తుందని మానవత సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి చెప్పారు. శుక్రవారం తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఇద్దరు విద్యార్థులకు రూ. 1,80,000 విలువైన రెండు డెస్క్ టాప్ కంప్యూటర్‌లను అందజేశారు. తణుకు రోటరీ క్లబ్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో స్వర్ణాంధ్రా కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న లంక గణేష్‌సాయి, అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ చదువుతున్న టీ సురేష్‌లకు డెస్క్ టాప్ కంప్యూటర్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, తణుకు యూనిట్ చైర్మన్ బోయపాటి రామలక్ష్మీ, కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు కటారి శారదాదేవి, కోశాధికారి అక్కిన కాశీ విశ్వనాథం, ఆలపాటి సుబ్బారావు, కె వాణి, కేవీ రమణమూర్తి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): పోషక విలువలు ఉన్న ఆహారం గర్భిణులు కచ్చితంగా తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వీరస్వామి అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ అతి తక్కువ ఖరీదైన ఆకుకూరలు, గుడ్లు, పండ్లు తీసుకుని మంచి భావాలతో గర్భిణులు ఉండటం వలన ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మిస్తారని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారయణ రాజు, కొప్పర్తి వీరరాఘవులు మాట్లాడుతూ ఆసుపత్రిలో జరుగుతున్న వైద్య సదుపాయాలు, సంపూర్ణంగా నిర్వహిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాతలు సహకారంతో గోంగూర, పాల కూర, కోడి గుడ్లు, బ్రెడ్స్, వేరుశెనగ ఉండలు 62 మంది గర్భిణులకు అందించామని తెలిపారు. వచ్చే శుక్రవారం ఇదే ప్రాంగణంలో సామూహిక సీమంతలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రామ మహేశ్వరి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో..

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధిత రోగులకు శుక్రవారం కొత్తల వసంతరావు చారిటబుల్ సేవ ట్రస్టు సహకారంతో న్యూట్రిషన్ సరుకులు సంపూర్ణంగా అందించారు. ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు డాక్టర్ రాంబాబు బాధితులకు పౌష్టికాహారాన్ని అందిచారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొప్పర్తి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షలు మంజూరు

పెంటపాడు: పెంటపాడులోని శిథిలమైన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకొనేందుకు వీలుగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక మహిళల కోరిక మేరకు పేటలో ఉన్న డ్రైనేజీ నిర్మాణానికి నిధులు అందిస్తానని, అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి కొట్టు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, తాడేపల్లి సూర్యకళ, ములగాల రామసత్యనారాయణ, తాడేపల్లి ప్రేమ్‌కుమార్, ఉన్నమట్ల ఏసురత్నం , దాసి బాబు, కర్రి వరహాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంటపాడులో మూడో రోజు గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: పెంటపాడు మండలంలోని మూడవరోజు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పెంటపాడు వార్డు సభ్యులు వెలగల శ్రీనివాసరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. కునాకరపేట, రెడ్లపేట ప్రాంతాల్లో జరిగే ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు విధిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక అభివృద్ధికి బోధకుల కృషి అవసరం

పెంటపాడు: క్రీస్తు సంఘాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధికి బోధకులు విశేష కృషి చేయాలని బిక్కవోలుకు చెందిన బైబిలు కళాశాల డైరెక్టర్ ఎం. జాన్‌డీన్, గూడెం బైబిలు కళాశాల డైరెక్టర్ రొక్కాల నాగబుజ్జిలు పేర్కొన్నారు. అలంపురం గ్రామంలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల క్రీస్తుసంఘ సువార్తికుల సమావేశం గెద్దం ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు విడతలుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని పనిలో విశ్వాసంతో నమ్మకంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ లీడ్‌క్యాప్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సందీప్, సేవకులు సురేష్, మధు, శ్రీధర్, మల్లేశ్వరరావు, ప్రసాద్ తదతరుతో పాటు, రెండు జిల్లాలకు చెందిన క్రీస్తుసంఘ సువార్తికులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం పై కేసు నమోదు

ఇరగవరం: మహిళ కుమార్తెతో సహ అదృశ్యం అయిన ఘటన ఇరగవరం మండలం రేలంగి ఇందిర నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై కె చంద్ర శేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం రేలంగి ఇందిర నగర్‌కి చెందిన తానేటి తక్షిక ఆర్చిప్ తన సంవత్సరం పాపతో సహ గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్నా భర్త తానేటి మహేంద్ర వర్మ బంధు మిత్రులు, చుట్టు ప్రక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఇరగవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీల్లో సంపూర్ణ పోషణ కిట్లను అందించాలి


అంగన్‌వాడీలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మహిళ కమిషన్ సభ్యురాలు వినీత

ఇరగవరం: సమయ పాలన పాటిస్తు విద్యార్థులు, బాలింత, గర్భిణులకు పౌష్టికాహరం అందించాలని రాష్ట్ర మహిళ కమీషన్ సభ్యురాలు బూసి వినీత అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం సూరంపూడి గ్రామంలో అంగన్‌వాడీ 195, 196 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజలను తండ్రీలా చూసుకుంటున్నారు. దానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహర లోపం, గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత లేకుండా ఆహారం అందించాలన్నారు. రికార్డులు, హాజరు పట్టి, స్టాకు రిజిష్టర్లు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టులు అందరికి అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు ప్రాజెక్టు అధికారి యబిఎస్ ప్రమోదీని కూమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నేలపాటి కాంత కూమారి సిబ్బంది రత్నకూమారి తదితరులు పాల్గొన్నారు.

పట్టుపరిశ్రమ అభివృద్ధికి కృషి


కడియద్ద ఆర్‌బీకే వద్ద జరిగిన శిక్షణ కార్యక్రమంలో సెరీకల్చర్ డీడీ వాణి మాట్లాడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సెరీకల్చర్ డీడీ వాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కడియద్ద ఆర్‌బీకే వద్ద పట్టు పరిశ్రమపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ వాణి మాట్లాడుతూ మల్బరీ తోట వేయడానికి ఎకరానికి నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు మొక్కలు అవసరమవుతాయన్నారు. ఒక్కో మొక్క రూ.2.50లు కాగా, ప్రభుత్వం సబ్సిడీగా రూ.2లకే అందజేస్తుందన్నారు. ఐదెకరాలు పైబడిన రైతులకు రూ.3లక్షలు సబ్సిడీ ఇస్తామని తెలిపారు. షెడ్డు లోపల బెడ్స్ నిర్మాణానికి ఎస్సీ రైతులకు రూ.43వేలు, ఇతర రైతులకు రూ.32వేలు సబ్సిడీ ఇస్తామన్నారు. ఆసక్తి గలరైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెరీకల్చర్ ఇన్‌స్పెక్టర్ వాసు, అసిస్టెంట్ సెరీకల్చర్ అధికారి పి.పాపారావు, మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్, వీహెచ్‌ఏ వీర్రాజు, రైతులు పాకనాటి తాతాజీ, యాతం సూర్యచంద్రరావు, పాలడుగుల కృష్ణ, పాకనాటి సత్యనారాయణ, పాకనాటి సుబ్బారావు, పరిమి బ్రహ్మనంద చౌదరి, యాతం సత్తిరాజు, దారపు రెడ్డి సత్యనారాయణ, కొండపల్లి మణికంత, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.మురళీకృష్ణ, గ్రామ పెద్దలు యాతం వెంకటరమణ, దారపురెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న హెల్త్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత ప్రజలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 31, 32, 33 వార్డుల్లో 50వ విడత ఫీవర్ సర్వేలను, ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేశారు. ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఎ.ఎన్.ఎం, ఆశలు, వలంటీర్స్ ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అదే విధంగా యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 20, 24, 25 వార్డుల్లో క్షేత్ర స్థాయిలో హెల్త్ సిబ్బంది పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ సర్వే బృందాలకు జ్వరాలు, కీటక జనిత వ్యాదులుపై ఖచ్చితమైన సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు వెంకట లక్ష్మి, రమణ, చిన్నపాప, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తణుకు టౌన్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ్ కోరారు. శుక్రవారం తణుకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి అధికారులు సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సూర్యతేజ్ మాట్లాడుతూ మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అంతర్గతంగా శాఖల మధ్య పరస్పర అవగాహనతో పాటు సహాయ సహకారాలతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ కేటీ సుధాకర్, గృహ నిర్మాణ, రెవిన్యూ, పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపకదళ, అధికారులతో పాటు మున్సిపల్, వార్డు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌కేఆర్‌లో ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై సదస్సు

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల నానో టెక్నాలజీ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25, 26 తేదీల్లో ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. శుక్రవారం సదస్సుకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీరియల్ ఇంజినీరింగ్, మెటీరియల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ పేరిట ఎంఈసి ఏపీ-23 సదస్సు నిర్వహిస్తున్నామని మెటీరియల్స్ పరిశోధనలో ఎన్నో మంచి ఫలితాలు వస్తున్నాయని వాటిని మరింత ఎక్కువ స్థాయిలో ఉపయోగపడే విధంగా అంతర్జాతీయ నిపుణులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గూడెంలో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ శుక్రవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 1.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

పెంటపాడు: ఈనెల 22న పెంటపాడు మండలంలోని వల్లూరుపల్లి, పెంటపాడు-2 గ్రామా ల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి జరిగే సమావేశాలకు ప్రజలు పాల్గొని సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రెటరీలను క్రమబద్ధీరించి, వారిని సచివాలయ వ్యవస్థ ఉద్యోగులుగా గుర్తించి వారి అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చెల్లబోయిన రంగారావు, యు.అంబేడ్కర్, పాలపర్తి భరత్, కె.సువర్ణరాజు, జి.దుర్గారావు, కె.సురేష్, కె.అన్నవరం పాల్గొన్నారు.